క్లుప్తంగా

దుంపా అనిల్‌కు పరామర్శ



అనిల్‌ను పరామర్శించిన వైఎస్సార్ సీపీ నాయకులు

జరుగుమల్లి(సింగరాయకొండ): వైఎస్సార్ సీపీ నాయకుడు, జరుగుమల్లి ఉప సర్పంచ్ దుంపా అనిల్‌కుమార్‌రెడ్డిని సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో అనిల్ తల్లి శ్రీదేవి మృతి చెందారు. ఈ సందర్భంగా అనిల్‌ను కలిసి పరామర్శించి ఆయనకు ధైర్యం చెప్పారు. పార్టీ జరుగుమల్లి, టంగుటూరు మాజీ మండల అధ్యక్షుడు బత్తిన మదన మనోహర్‌రావు, మల్లవరపు రాఘవరెడ్డి పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

సింగరాయకొండ: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ నెల 28వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారి రవితేజ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు యువకులు అర్హులని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఔత్సాహికులైన యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరిరూరల్: మండలంలోని అజీస్‌పురం, పునుగోడు, తాళ్లూరు, గుడిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ రూరల్ ఏఈ నవీన్‌కుమార్ తెలిపారు. 25న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: పట్టణంలోని11కేవీ వీఐపీ ఫీడర్ పరిధిలో విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవీ నరసింహం తెలిపారు. పట్టణంలోని తూర్పువడ్డిపాలెం, తూర్పుకమ్మపాలెం, తూర్పుసాలిపాలెం, మారెమ్మమిట్ట, లింగయ్య నాయుడు ఇంటి ప్రాంతం, కోటారెడ్డినగర్, హీరోహోండా షోరూం ఏరియా, క్లబ్ రోడ్, ఆదియేంద్రకాలనీ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

బయోగ్యాస్ ఏర్పాట్ల పరిశీలన



జంగిల్ తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

పీసీపల్లి: మండల పరిధిలోని దివాకరపురం సమీపంలో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ ప్లాంట్ పనులను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ నెల 2వ తేదీ భూమిపూజకు పలువురు ముఖ్య అతిథులు హాజరవుతున్నారన్నారు. ఈ ప్లాంట్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలువురికి ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంగాభవానీ తిరునాళ్ల

సీఎస్‌పురం(పామూరు): స్థానిక గంగాభవానీ ఆలయ ద్వితీయ వార్షిక వేడుకల సందర్భంగా గంగామాత తిరునాళ్ల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రాలతో గంగామాత మూల విగ్రహ మూర్తికి, ఉత్సవమూర్తికి విశిష్ట పూజలు చేశారు. తొలుత పుణ్యాహవాచనం, హోమం, సహస్ర కుంకుమార్చన, పూర్ణాహుతి నిర్వహించారు. జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, ఇండ్లా బాలయ్య, మేకల బాలు, నన్నసాని గుంటెయ్యయాదవ్, భక్తులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మద్రిపూడి: మండలంలోని రావెళ్లవారిపాలెం కేజీబీవీ బాలికల పాఠశాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగమణి సోమవారం ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 11వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. బడి బయట పిల్లలు, అనాథలు, డ్రాపౌట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీ, బీపీఎల్‌కు చెందిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్‌లగా పరిగణిస్తామన్నారు. వివరాలకు 6300077944 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రయాణం..నరకప్రాయం

- అధ్వానంగా కట్టకిందపల్లె, కరోళ్లపాడురోడ్డు
- కనీస మరమ్మతులు పట్టించుకోని ప్రభుత్వం
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



గుంతలమయంగా ఉన్న కరోళ్లపాడు రోడ్డు

పామూరు: మండలంలోని తూర్పుకట్టకిందపల్లె, కోరోళ్లపాడురోడ్డు గుంతలమయంగా అధ్వానంగా మారింది. దీంతో ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. అడుగుకో గుంత ఉండటంతో ఏ క్షణంలో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందే పరిస్థితి ఇక్కడ నెలకొంది. 167బీ పామూరు కందుకూరు రోడ్డు జాతీయ రహదారిలో మండలంలోని 30వ మైలు వద్ద నుంచి తూర్పు కట్టకిందపల్లె, కరోళ్లపాడు వెళ్లే పంచాయతీరాజ్‌కు చెందిన రోడ్డు గోతుల మయంగా ఉంది. ఈ రోడ్డులో నిత్యం వందల సంఖ్యలో ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఉదయం, సాయంత్రం విద్యార్థులతో వచ్చే పాఠశాల వాహనాలు, పాదచారులు గుంతల రోడ్డుతో ఇక్కట్లు పడుతున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని రైతులు తాము సాగుచేసిన పంటలు, గడ్డి, యంత్రాలు ఇతరత్రా గ్రామం నుంచి పొలాల్లోకి వెళ్లే సమయంలో, తిరిగివచ్చే సమయంలో పడే అవస్థలు చెప్పేవీ కావు.

దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్తులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు దాటినా ఈరోడ్డు పూర్తిస్థాయిలో మరమ్మతుల గురించి గానీ, కొత్త రోడ్డు నిర్మాణం గురించి గానీ పట్టించుకోలేదు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం

మండంలోని మోపాడు 30వ మైలు 167బీ జాతీయ రహదారి వద్ద నుంచి కట్టకిందపల్లె, కరోళ్లపాడు రోడ్డు మొత్తం 5.5 కిలోమీటర్లకు సంబంధించి రూ.3.25 కోట్లతో ప్రతిపాదనలు పంపాం నిధులు మంజూరై వచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– ఎలీషా, పీఐయూ వర్క్స్ జేఈ



మోపాడు ప్రధాన కాల్వ సమీపంలో గుంతలతో ఉన్న రోడ్డు



గుంతలమయంగా తూర్పు కట్టకిందపల్లె రోడ్డు

ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు

- మున్సిపల్ సమావేశంలో సభ్యుల ధ్వజం



సమస్యలపై మాట్లాడుతున్న వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి

కనిగిరిరూరల్: ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదు. వార్డుల్లో అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయని పలువురు సభ్యులు మున్సిపల్ సమావేశంలో ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన సాధారణ, బడ్జెట్ సమావేశాలు నిర్వహిచంచారు. ఈ సందర్భంగా వైఎస్ చైర్మన్‌లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, శ్రీరాం సతీష్, పాతిరెడ్డి రాజా తదితరులు విద్యుత్, వాటర్, శానిటేషన్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 18వ వార్డుల్లో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని.. అక్కడ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ స్థలం ఉన్నా.. కొందరు దాన్ని ఆక్రమించి కట్టుకున్నారని తెలిపారు. చెత్త సంపద కేంద్రం నిర్వీర్యంగా మారిందని, వార్డులో శానిటేషన్ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మాచరంలో బరియల్ గ్రౌండ్ సమస్య, వాటర్ సమస్యపై అనేక మార్లు అడిగిన అధికారులు పట్టించుకోవడం లేదని 6వ వార్డు కౌన్సిలర్ పోతిరెడ్డి రాజా వాపోయారు. పేదలు అత్యధికంగా ఉండే తన వార్డులో అభివృద్ధి కనీసం జరగడం లేదని 12వ వార్డు కౌన్సిలర్ శ్రీరాం సతీష్ పేర్కొన్నారు. విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సాధారణ సమావేశంలో మిన్నకున్న సభ్యులు బడ్జెట్ సమావేశంలో గళం విప్పారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి 18వ వార్డులో మున్సిపల్ బావిని ఆక్రమించిన వారిపై చర్యలకు మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. సభ్యులు వార్డులోని సమస్యల పట్ల అధికారులను ప్రశ్నించి పనిచేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ తయారికి ముందుకు ప్రతి వార్డు సభ్యుడితో మాట్లాడి.. వారి వార్డుల్లోని ప్రాధాన్యత సమస్యలను చేర్చాలని కమిషనర్‌ను ఆదేశించారు. చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ సమిష్టి ప్రణాళికతో పట్టణంలో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామన్నారు. అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యతగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాభివృద్ధిలో అధికారులు భాగస్వామ్యులుగా పనిచేయాలన్నారు.

రూ.24 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

2025-26 ఏడాదికి సంబంధించి బడ్జెట్‌ను రూ.24.84 కోట్లకు ఆమోదించారు. అందులో రెవెన్యూ, ఆదాయం ఖర్చు రూ.7.69 కోట్లు కాగా మూలధన వ్యయం రూ.17.09 లక్షలు పోను మిగులు బడ్జెట్ రూ.6.55 లక్షలకు సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం



పామూరులో ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కాకర్లలో ర్యాలీ చేపట్టిన ఆరోగ్య సిబ్బంది

పామూరు: క్షయవ్యాధిపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రవళి ప్రియాంక పేర్కొన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నియంత్రణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని బొట్లగూడూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక బీసీ హాస్టల్ వద్ద నుంచి మమ్మీడాడీ సెంటర్ వరకు వైద్యశిబ్బంది, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి జలుబు, దగ్గు, సాయంత్రం సమయంలో జ్వరం వస్తుంటే వైద్యులను సంప్రదించడం మంచిదన్నారు. ఈసందర్భంగా ప్రతిజ్ఞచేశారు. హెచ్‌ఈఓలు ఎస్.బ్రహ్మానందం, పెరుగు శ్రీధర్, సిబ్బంది సరళ, ఎంపీహెచ్‌ఎస్ విజయనిర్మల, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

మద్రిపూడి: క్షయ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని డాక్టర్ తేజ అన్నారు. మండలంలోని కాకర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజ మాట్లాడుతూ రెండు వారాలకు మించి జ్వరం, బరువు తగ్గడం, కళ్లెతో రక్తం పడటం క్షయ వ్యాధి లక్షణాలన్నారు. క్షయ వ్యాధి పూర్తిగా మందుల వల్ల నయం చేయవచ్చని, భయపడాల్సిన అవరం లేదన్నారు. ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఏడుకొండలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఏ సృజన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం క్రమంగా బరువు తగ్గడం, దగ్గినప్పుడు రక్తం పడటం వంటి లక్షణాలు కన్పిస్తే...టీబీ లక్షణాలు ఉండవచ్చన్నారు. సూపరిండెంట్ ఎంపీ సుబ్బయ్య, వి.తిరుపతిరెడ్డి, ఫణి, టీబీ యూనిట్ అధికారి బాబురావు, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, రామాంజనేయులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్

సీఎస్పురం(పామూరు): ప్రజలు చోరీలపట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ భీమానాయక్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి రికార్డుల నిర్వహణపై సూచనలు చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎస్సై ప్రసాద్‌రెడ్డికి సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ ఉన్నారు.

దాతల సాయం అభినందనీయం

హనుమంతునిపాడు: మండల పరిధిలోని పెద్ద ముప్పాళ్లపాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం దాతలు 30 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్, వాటర్‌బాటిళ్లు అందజేసినట్లు హెచ్‌ఎం కేవీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన పోతిరెడ్డి సుధీర్‌రెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని వారి తల్లిదండ్రులుమా లకొండారెడ్డి, ఈశ్వరమ్మ, కుమారులు పోతిరెడ్డి సాత్విక్ రెడ్డి, శ్రీయాస్‌రెడ్డిలు విద్యార్థులకు వీటిని అందజేశారు. సీఆర్‌పీ చిన్న బాదుర్ల, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్త్రీనిధి రుణాలు వసూలు చేయాలి

మద్రిపూడి: స్త్రీనిధి రుణాలను వంద శాతం వసూలు చేయాలని ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం మండల సమైఖ్య అధ్యక్షురాలు నవనీతమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి రుణాలను వంద శాతం వసూలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్‌లో డ్వాక్రా మహిళల వివరాలను గ్రూపుల వారీగా నమోదు చేయాలన్నారు. ఏప్రిల్‌లో ఆడిట్ ఉన్నందున అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు.

60 మంది రక్తదానం

సింగరాయకొండ: జీవీఆర్ సంస్థల అధినేత గంధి వెంకటేశ్వరరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం ఆక్వా కంపెనీ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60 మంది రక్తదానం చేసినట్లు కంపెనీ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. పలువురు వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కంపెనీ సిబ్బందికి అన్నదానం చేశారు. రిమ్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు నర్సును నియమించండి



వినతిపత్రం అందచేస్తున్న చైర్మన్ మోహన్

కనిగిరిరూరల్: స్థానిక గార్లపేట రోడ్డులో ఉన్న మోడల్ స్కూల్‌కు నర్సును కేటాయించాలని ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ పందిటి మోహన్ కోరారు. సోమవారం ఆయన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.సృజనకు వినతి పత్రం అందచేశారు. సుమారు 1000 మంది వరకు విద్యార్థులు ఉండి.. పట్టణానికి కిలో మీటర్ దూరంలో ఉన్న మోడల్ స్కూల్‌కు అత్యవసర చికిత్సలు, ప్రాథమిక చికిత్సలకు, తక్షణ వైద్య సేవలకు, సలహాలకు వైద్య సిబ్బంది అవసరం ఎంతో ఉంటుందని, తక్షణ వైద్య సహాయం కోస విద్యార్థులు పడుతున్న అవస్థల గురించి వివరించారు. కొటికర్ల బాదుర్లా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



డ్రోన్ కెమెరాలతో కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్సై

కనిగిరిరూరల్: పట్టణం, మండలంలోని పలు పరీక్ష కేంద్రాలను డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్, ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డిలు వేర్వేరుగా సోమవారం తనిఖీ చేశారు. కంచర్లవారిపల్లి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల కేంద్రాలను డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల ఆవరణలో తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొబైల్‌ను ఎవరు తీసుకుని రాకుండా తగు ఆదేశాలిచ్చారు. డ్రోన్ కెమెరాల నిఘాతో డీఎస్పీ స్వయంగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలను చూశారు. ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి సెయింట్ జోసఫ్, చింతలపాలెం ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. వీరి వెంట ఎస్సై టి.శ్రీరాం, తహసీల్దార్ ఏవీ రవి శంకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కందుల కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పీసీపల్లి: కందుల కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీసీపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జి థామస్ అన్నారు. స్థానిక సొసైటీ వద్ద కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవార ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్ముకోవాలని, అమ్మిన 15 నుంచి 20 రోజుల లోపు నేరుగా వారి ఖాతాల్లో నగదు జమవుతుందని తెలిపారు. నాగోతి శ్రీను, వేము రామయ్య, ముల్క నాగేశ్వరావు, వీరబ్రహ్మేంద్ర పెద్దన్న, మూల సత్తిరెడ్డి అధికారులు పాల్గొన్నారు .

కంది రైతులు దళారులను ఆశ్రయించొద్దు

సీఎస్‌పురం(పామూరు): కందిరైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం కందికి మద్దతు ధరను క్వింటా రు.7550గా ప్రకటించిందన్నారు. ప్రస్తుతం మండలంలోని గోగులపల్లిలోని రైతుసేవాకేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు, రైతులు దీన్ని వినియోగించుకోవాలన్నారు. రైతులు రైతుసేవాకేంద్రంలో కందులను విక్రయించుకోవాలంటే విధిగా పంటను నమోదు చేసుకొని ఉండాలన్నారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, వీఏఏ విజయ్ పాల్గొన్నారు.

పొగాకు కనిష్ట ధర రూ.250



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ.271.56 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. గుర్రప్పడియ, చతుకుపాడు, కె.అగ్రహారం, రామచంద్రాపురం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 423 బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. అందులో 379 బేళ్లను కొనుగోలు చేయగా వ్యాపారులు వివిధ కారణాలతో 44 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.250 పలికింది. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక వేలంకేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 239 బేళ్ల వ్యాపారులు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి ఏ శ్రీనివాసరావు తెలిపారు. తూర్పు నాయుడుపాలెం గ్రామానికి చెందిన రైతులు 297 బేళ్లను వేలానికి తీసుకురాగా అందులో 239 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసి వివిధ కారణాలతో 58 బేళ్లను తిరస్కరింఛారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260, సరాసరి రూ.275.50 నమోదైంది.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం



రైతులను సన్మానిస్తున్న ఏఓ, ఏపీఎం

కొండపి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తే భూమి ఆరోగ్యంగా ఉంటుందని, ఆ పంటలు మనం తినడం వల్ల మనం కూడా ఆరోగ్యంగా ఉండి రోగాలను అరికట్టవచ్చని వ్యవసాయాధికారి డి.విజయ్ కుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో రైతు సాధికారిక సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉద్యాన, వెలుగు సిబ్బందితో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఎంటీ ఎస్తేరు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ గ్రామాల్లో రైతులు తమ పొలంలో నవధాన్యాలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. రైతులు ఒకే పంట వేయకుండా పలు పంటలు వేయడం వల్ల అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. ఏపీఎం గోపీనాథ్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఏపీసీఎంఎఫ్ ప్రాజెక్ట్ జూనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారిని ఝాన్సీ, వ్యవసాయ శాఖ ఏఈఓ కుమార్, యూనిట్ ఇన్‌చార్జిలు రంజిత్, మందాకిని, మాధవ ఐసీఆర్పీలు మాలకొండయ్య, జోత్స్న, నాగరాజు, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన విద్యనందించాలి



శిక్షణ ఇస్తున్నసూపర్‌వైజర్ రమాదేవి

పొన్నలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యనందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని మండ్లమూరివారిపాలెంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు నూతన అంశాలపై మూడు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను కచ్చితంగా నేర్పించాలన్నారు. ఆట ఆధారిత బోధన ద్వారా చిన్నారులు చెప్పే అంశాలను త్వరగా నేర్చుకుంటారన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను తప్పకుండా పిల్లలకు నేర్పించాలన్నారు. మద్రిపూడి సూపర్‌వైజర్ సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు..

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రతి చిన్నారి సర్వతోముఖాభివృద్ధి సాధించేలా తీర్చిదిద్దాలని సీడీపీఓ మల్లీశ్వరి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషన్ బీ-పడాయి బీపథకం కింద మూడు రోజుల శిక్షణ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. సీడీపీఓ మల్లీశ్వరి మాట్లాడుతూ 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులకు బొమ్మలతో నాణ్యమైన విద్యను అందించాలని, వారికి ఆరోగ్యకరమైన ఆహారం అందించటంతో పాటు విద్యను అందించాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భారతి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

కనిగిరిరూరల్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్, పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై టీ శ్రీరాం అన్నారు. పట్టణంలోని గార్లపేట రోడ్డు, ఒంగోలు బస్టాండ్, పొదిలి రూట్‌లలో సోమవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై టి.శ్రీరాం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్సు పొంది ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో ఓవర్ లోడ్ చేసినా, పెద్ద శబ్దంతో టేప్ రికార్డ్‌లు పెట్టినా.. ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి ఆటో నడిపినా చట్ట ప్రకారం జరిమానా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిబంధనలు, జరిమానాలు, తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు.